సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 17 । జూన్ । 2025



రెప్పపాటులో.. రెండు ప్రాణాలు

దైవ దర్శనానికి వెళ్లిన ఆ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 8లో▸



భక్తుల భద్రత గోదావరిలో దీపమే!

బాసర గోదావరి వద్ద భక్తుల ప్రాణాలకు భద్రత కరువైంది. పుణ్యస్నానం కోసం వచ్చిన వారు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: తిరుమల వేంకటేశ్వరస్వామిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం దర్శించుకున్నారు. తన జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 1,980 మంది పరీక్షలకు హాజరుకాగా, 1,417 మంది ఉత్తీర్ణులయ్యారు. 71.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాల పరంగా జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. ఒకేషనల్ విభాగంలో 126 మంది పరీక్షకు హాజరుకాగా,69మంది పాస్ అయ్యారు. 54.76 శాతం నమోదైంది. ప్రథమ సంవత్సరం జనరల్‌లో 4,043 మంది పరీక్షలు రాయగా 3,106 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 114 మంది హాజరు కాగా, 85 మంది ఉత్తీర్ణులయ్యారు. 74.56 శాతం ఉత్తీర్ణత నమోదైందని డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్ తెలిపారు. ఒకట్రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులంతా ఈ సప్లిమెంటరీ పరీక్షల్లో పాసయ్యారని పేర్కొన్నారు. రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 17 నుంచి 23వరకు దరఖాస్తుచేసుకోవచ్చని సూచించారు. రీకౌంటింగ్‌కు రూ.100, రీవెరిఫికేషన్‌కు రూ.600 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా

తలమడుగు: రైతులు సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సుంకిడి గ్రామ రైతు వేదికలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. నేల ఏ పంటకు అనుకూలమో వాటినే సాగు చేయాలన్నారు. పంట మార్పిడితో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పిడుగులు పడుతున్నాయని, ఈ విషయంలో ముందస్తు జాగ్రతలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'ఆదివాసీలపై దాడులు సరికాదు'



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల దాడులను ఖండిస్తున్నామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని కుమురంభీం గూడలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆదివాసీలు సాగు చేస్తున్న వ్యవసాయ భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటడం, కందకాలు తవ్వడం వంటి చర్యలు సరికాదన్నారు. ఏటూరునాగారం మండలంలోని అటవీశాఖ పరిధిలో ఆదివాసీలు నివసిస్తున్న గుడిసెలను తొలగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ అధికారుల దాడులు పెరిగాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరుణ్, డివిజన్ అధ్యక్షులు గణపతి, తదితరులున్నారు.

పరిషత్ సందడి

- మారనున్న జెడ్పీ స్వరూపం
- ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి
- జిల్లాలో పెరగనున్న జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ
- ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

జిల్లాలో..
మండలాలు : 20
ఎంపీటీసీ స్థానాలు : 169 (కొత్తవి 11)
జెడ్పీటీసీ స్థానాలు : 20 (కొత్తవి 3)



కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం తొలుత పరిషత్ ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ నెలాఖరులోపు షెడ్యూల్ విడుదల కానున్నట్లుగా రాష్ట్రమంత్రులు ప్రకటించడంతోఆశావహుల్లో జోష్ మొదలైంది. ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. అయితే ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికలను పాత రిజర్వేషన్ల ప్రకారం నిర్వహిస్తుందా లేక కొత్తగా ప్రకటిస్తుందా అనే దానిపై ఉత్కంఠ మాత్రం వీడటం లేదు. మరోవైపు పరిషత్ ఎన్నికల నిర్వహణతో జెడ్పీ స్వరూపం మారనుంది. మండలాల పునర్విభజనతో కొత్తగా పలు ఎంపీటీసీ స్థానాలు ఏర్పడగా, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు అదనంగా పెరిగాయి. ఈ క్రమంలో ఆయా స్థానాల రిజర్వేషన్లు అనివార్యం కానున్నాయనే అభిప్రాయం వ్యక్తమతుంది. దీంతో ఏ మండలానికి ఏ రిజర్వేషన్ వస్తుందోననే ఆందోళన ఆశావహుల్లో వ్యక్తమవుతుంది.

పెరిగిన స్థానాలు ...

జిల్లాలో గ్రామీణ మండలాలు గతంలో 17 ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడు కొత్తగా ఏర్పాటు చేసింది. బోథ్‌మండలాన్ని పునర్విభజన చేసి సొనాల మండలంను, జైనథ్‌ను విభజించి సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేశారు. బేల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని పలు గ్రామాలను ఆయా మండలాల పరిధిలోకిచేర్చారు. దీంతో ఆయా మండలాలకు జెడ్పీటీసీ, ఎంపీపీలు ఎన్నికయ్యే అవకాశముంది. కాగా ఆయా మండల్లాలోని గ్రామ పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా ఎంపీటీసీ స్థానాలను సైతం పునర్విభజన చేశారు. జిల్లాలో గతంలో 158 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, పునర్విభజనతో 11 మండల ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల ను అదనంగా పెంచారు. దీంతో ఈ సంఖ్య ప్రస్తు తం 169కి చేరింది. మావల మండలంలో రెండు, ఉట్నూర్ గ్రామ పంచాయతీలో నాలుగు స్థానాలను పెంచగా పునర్విభజన జరిగిన మండలాల్లో సొనాల, భోరజ్, సాత్నాల మండలాల్లో మరో ఐదు స్థానాలు పెంచారు. తద్వారా మండల సర్వసభ్య సమావేశాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో ఎలక్షన్ ఫీవర్

స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ నెలాఖరులోగా ఎప్పుడైనా షెడ్యూల్ రావచ్చంటూ మంత్రులు సీతక్క, పొంగులేటి చేసిన ప్రకటనలు ఆశావహుల్లో జోష్ నింపింది. పోటీకి సై అంటున్న వారు గ్రామాల్లోని ఓటర్ల ను మచ్చిక చేసుకునేపనిలో నిమగ్నమయ్యారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలపై ఆరా తీస్తున్నారు. ఎలాంటి శుభకార్యాలైనా అక్కడ వాలిపోతున్నారు. ఇక గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు ముగిసే వరకు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోసారి వారింటికెళ్లి పరామర్శిస్తున్నారు. మరికొంత మంది ఆశావహులు గ్రామ సమస్యలపై స్థానికులతో వెళ్లి కలెక్టర్, అధికారులను కలుస్తున్నారు. పరిష్కరించాలని కోరుతున్నారు. దీంతో పల్లెల్లో ప్రస్తుతం ఎటు చూసినా ఎన్నికల సందడే కనిపిస్తోంది.

జెడ్పీ స్వరూపం ఇలా..

గతంలో 17 మండలాలుండగా 17 మంది చొప్పున జెడ్పీటీసీలు, ఎంపీపీలు సభ్యులుగా ఉండేవారు. ఇందులో నుంచే ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. త్వరలో నిర్వహించనున్న పరిషత్ ఎన్నికల్లో ఈ సంఖ్య 20కి చేరనుంది. కొత్తగా మరో ముగ్గురు జెడ్పీటీసీలు, ముగ్గురు ఎంపీపీలు జిల్లా పరిషత్‌లోకి అడుగుపెట్టనున్నారు. మండలాల సంఖ్య పెరగడం, గ్రామ పంచాయతీలు, అక్కడి జనాభాకనుగుణంగా ఎంపీటీసీల పునర్విభజన జరగడంతో ఆయా స్థానాల రిజర్వేషన్లు మారనున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. అయితే ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించింది. అదే జరిగితే బీసీలకు కలిసొచ్చే అవకాశం ఏర్పడి సభలో వారి సంఖ్య పెరిగే అవకాశముంటుంది. అయితే ఇప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాకపోవచ్చని పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు జరిగే అవకాశముందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

రైతుకు భరోసా..

- బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ
- ఈసారి ఎకరాలతో సంబంధం లేకుండా లబ్ధి
- అన్నదాతల్లో ఆనందం

జిల్లాలో రైతులు : 1,68,238
రైతు భరోసా నిధులు :రూ.342.30 కోట్లు



ఆదిలాబాద్‌టౌన్: వానాకాలం పెట్టుబడి సాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను సోమవారం విడుదల చేసింది. అయితే ఈసారి ఎకరాలతో సంబంధం లేకుండా రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తోంది. దీంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతుంది. మొదటి విడతగా రెండెకరాల్లోపు రైతులకు అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యాయి. మిగతా రైతులకు వారంలోగా జమ అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 1,68,238 మంది రైతులు ఉన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.342 కోట్ల 30లక్షల 71వేల 305 విడుదల చేసింది. ఆయా మండలాల ఏఈవోలు 1,61,775 అకౌంట్లను అప్‌గ్రేడ్ చేశారు. కాగా 1,61,552 అకౌంట్లను మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. 1,10,647 మంది రైతులకు సంబంధించిన అకౌంట్లను ట్రెజరీ అధికారులకు పంపించారు. ఇందుకు గాను రూ.148కోట్ల 41లక్షల 307 రైతుల అకౌంట్‌లో జమకానున్నాయి. తొలివిడతగా సోమవారం సాయంత్రం రెండెకరాల లోపు రైతుల అకౌంట్లలో జమ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరానికి రూ.6వేల చొప్పున పెట్టుబడి సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం మూడోసారి విడుదల చేసింది. గత యాసంగిలో జిల్లాలో 96,682 మంది రైతులకు రూ.124.50 కోట్ల నిధులను రైతుల అకౌంట్లలో జమ చేసింది. అయితే గతంలో పూర్తిస్థాయిలో రైతులకు రైతు భరోసా జమ కాలేదు. నాలుగు ఎకరాల్లోపు మాత్రమే నిధులు జమైనట్లుగా చెబుతున్నారు. ఈసారి ఎకరాలతో సంబంధం లేకుండా రైతులందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు సమయంలో నిధులు ఖాతాల్లోకి చేరడంతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఉపయోగపడుతుండటంపై రైతుల్లో సంతోషం వ్యక్తమవుతుంది. కాగా, కొత్త రైతులకు సంబంధించి ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

రైతుల వివరాలు..

మండలం	గ్రామాలు	పట్టా రైతులు
ఆదిలాబాద్‌రూరల్	44	11,467
ఆదిలాబాద్‌అర్బన్	03	502
బజార్‌హత్నూర్	41	10,692
బేల	53	11,530
భీంపూర్	23	8,741
భోరజ్	28	6,992
బోథ్	42	11,294
గాదిగూడ	61	7,737
గుడిహత్నూర్	29	7,865
ఇచ్చోడ	44	10,985
ఇంద్రవెల్లి	47	9,359
జైనథ్	26	9,853
మావల	06	1,019
నార్నూర్	40	7,060
నేరడిగొండ	58	11,377
సాత్నాల	12	3,206
సిరికొండ	26	5,943
సొనాల	10	3,707
తలమడుగు	33	11,503
తాంసి	12	6,023
ఉట్నూర్	58	11,383
మొత్తం	696	1,68,238

ఉన్నత చదువా.. పట్నమే దారి!

- ఇప్పటికే చేజారిన గిరిజన వర్సిటీ
- ఉత్తర్వులకే పరిమితమైన 'ఇంజినీరింగ్'
- జిల్లాలో కానరాని పీజీ, ఫార్మా కళాశాలలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు.. పట్టించుకోని పాలకులు



ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇదే..

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీ విద్యార్థి జీవితంలో రాణించాలంటే ఉన్నత చదువు ఎంతో అవసరం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంసైతం అందిపుచ్చుకోవాలి. అయితే అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ జిల్లాలో అందుకు అవసరమైన అవకాశాలు కానరాని పరిస్థితి. వనరులున్నాసంబంధిత విద్యాసంస్థలు నెలకొల్పడం లేదు. పీజీ, ఇంజినీరింగ్, ఫార్మా, ఎంబీఏ,ఎంసీఏ వంటి కోర్సుల్లో విద్యను అభ్యసించాలంటే హైదరాబాద్, వరంగల్ తదితర నగరాలకు వెళ్లాల్సిన దుస్థితి. ఈ క్రమంలో చాలామంది పేద విద్యార్థులు డిగ్రీకే పరిమితమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్రం జిల్లాకు గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసింది. అయితే జిల్లా పాలకుల పట్టింపులేమి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వెరసీ ఆ వర్సిటీ ఉమ్మడి వరంగల్‌కు తరలిపోయింది. ఇలా ఈప్రాంతానికి విద్యాపరంగా తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉంది. గళమెత్తాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నత చదువులకు దూరం..

రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో యూనివర్సిటీలు ఉండగా ఆదిలాబాద్‌లో మాత్రం కానరాని పరిస్థితి. జిల్లాలో కేవలం రిమ్స్, అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. గతంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల ఉండగా అది హైదరాబాద్‌కు తరలిపోయింది.జిల్లాకేంద్రంలో ప్రభుత్వడీఎడ్ కళాశాల ఉన్నా అందులో కేవలం ఇద్దరు రెగ్యులర్ లెక్చరర్లు మాత్రమే ఉన్నారు. వారికి కూడా ఇతర జిల్లాల్లో డీఈవోలుగా అదనపు బాధ్యతలు ఉండడం గమనార్హం. బీఎడ్ విషయానికి వస్తే రెండు ప్రైవేట్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఇంటర్ పూర్తి చేసినవారికి ఇంజినీరింగ్ చదవాలంటే ఇతర జిల్లాలకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో మంచి ర్యాంకులు వచ్చిన వారు సైతం ఆర్థిక పరిస్థితులు సరిగా లేని కారణంగా చదువుకోలేకపోతున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ఊసేది..

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చిన సందర్భంలో ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఉన్నతీకరిస్తూ ఇక్కడే తరగతులు నిర్వహిస్తారని ప్రకటించారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారింది. ప్రస్తుతం ఆ అంశం అటకెక్కింది.

పీజీ కూడా లేదాయే..

డిగ్రీ పూర్తయిన తర్వాత జిల్లా విద్యార్థులు పోస్టు గ్రాడ్యుయేట్ చేయలేని దుస్థితి. ఏటా వేలాది మంది డిగ్రీ కోర్సు పూర్తి చేసిన తర్వాత పీజీ ఎంట్రెన్స్ రాస్తున్నారు. అయితే జిల్లాలో పీజీ కళాశాల లేకపోవడంతో హైదరాబాద్, వరంగల్‌కు వెళ్లి ఉన్నత చదువులు చదవాల్సిన పరిస్థితి. ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బాటనీ, జువాలజి, ఆర్ట్స్ డిగ్రీ కళాశాలో ఎకనామిక్స్ పీజీ కోర్సులు మాత్రమే ఉన్నాయి. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ద్వారా కేవలం ఆర్ట్స్‌కు సంబంధించిన పీజీ కోర్సులు ఉండడంతో చాలా మంది సైన్స్ విద్యార్థులు డిగ్రీకే పరిమితం అవుతున్నారు.

యూనివర్సిటీ మంజూరు చేయాలి



జిల్లాలో యూనివర్సిటీ మంజూరు చేస్తేనే విద్యాపరంగా అభివృద్ధి సాధ్యపడుతుంది. ప్రస్తుతం చాలామంది విద్యార్థులు డిగ్రీ తర్వాత ఉన్నత చదువులు కొనసాగించలేకపోతున్నారు. అలాగే బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఇన్సూరెన్స్ తదితర కొలువుల కోసం ప్రత్యేకంగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి.

– సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సైన్స్ కళాశాల

గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలి



జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. గతంలో జిల్లాకు కేటాయించినా వరంగల్‌కు తరలిపోయింది. పాలకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. గత ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేసినా ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో గిరిజన యువత ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

– గణేశ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అర్జీల వెల్లువ

- జన జాతరలా ప్రజావాణి
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి జాతరను తలపించింది. తమ సమస్యలు నివేదించేందుకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. కలెక్టర్ రాజర్షి షా వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై ఈవారం మొత్తం 104 దరఖాస్తులు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే...

ఇళ్ల మంజూరులో అక్రమాలు..



ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులిచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేస్తున్నారు. మా లాంటి పేదలను విస్మరిస్తున్నారు. మొదటి జాబితాలో మా పేర్లు వచ్చినా డబ్బులు ఇవ్వలేదనే కారణంతో తొలగించారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– దుర్గానగర్‌కాలనీవాసులు, ఆదిలాబాద్

ఇళ్లలోకి మురుగునీరు ..



మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గల మురుగుకాలువ చిన్నగా ఉండటంతో నీరంతా రోడ్లపైకి వచ్చి ఇళ్లలోకి చేరుతుంది. వర్షాలు కురిసిన సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– లాండసాంగ్వీ గ్రామస్తులు, ఆదిలాబాద్ రూరల్

రెయిన్‌కోట్‌లు అందించాలి

ప్రభుత్వపరంగా మాకు అందించాల్సిన యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, బెల్లం, హ్యాండ్‌గ్లౌజ్‌లు, షూ వంటివేమి ఇవ్వడం లేదు. వర్షాకాలంలో డ్రెయినేజీల్లో చెత్త తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అలాగే వర్షాలకు తడవకుండా రెయిన్ కోట్లు అందించాలి.

– మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆదిలాబాద్



భూ కబ్జాపై చర్యలు తీసుకోవాలి



మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని సర్వేనంబర్ 72/18లో గల 15 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని కల్లెం భూమారెడ్డి అక్రమంగా కబ్జా చేసి సాగు చేస్తున్నాడు. అప్పటి కలెక్టర్ ఈ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని దాని చుట్టు కంచె కూడా వేయించారు. కబ్జాదారు దాని పక్కనే మరో ఫెన్సింగ్ వేసి ఆక్రమించాడు. విచారణ జరిపించి తగు చర్యలు చేపట్టాలి.

– దళిత, గిరిజన సంఘాల నాయకులు, ఆదిలాబాద్

ఇంటి పట్టాలు ఇప్పించండి..

సార్.. మేమంతా కూలీనాలి చేసుకునే నిరుపేదలం. ఉండటానికి ఇళ్లు లేకపోవడంతో 15ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సర్వేనంబర్ 59లోని కేబీ కాలనీలో 22 మందికి ఇంటిస్థలాలు కేటాయించింది. గుడిసెలు, పెంకుటిళ్లు నిర్మించుకుని అప్పటి నుంచి అక్కడే జీవిస్తున్నాం. అయితే ఇప్పటి వరకు వాటికి పట్టాలు జారీ చేయలేదు. దీంతో ప్రభుత్వపరంగా అందించే ఇందిరమ్మ ఇళ్లను పొందలేకపోతున్నాం. విచారణ జరిపించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– కేబీ కాలనీవాసులు, కూర, జైనథ్



గిరిజనేతర రైతుల ఆందోళన



కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న గిరిజనేతరులు

కైలాస్‌నగర్: తమ సాగు భూములకు పహణీలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వమందించే పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నామని గాదిగూడ, నార్నూర్ మండలాల గిరిజనేతర రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములకు పహణీలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో సోమవారం నిరసన తెలిపారు. కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ దళితుల భూ సంరక్షణ సమితి అధ్యక్షుడు నిరంజన్, సంతోష్, సదాశివ్, దశరథ్, నరహరి, హన్మంత్, రాష్ట్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఫిర్యాదుదారుడి సమస్య వింటున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు విని వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం 54 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరి రిమాండ్

జన్నారం: బాలికను కిడ్నాప్‌చేసి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడంలేదని ఈనెల 1న ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మందపల్లి వాసి మోతే అర్జున్ బాలికను కిడ్నాప్ చేసినట్లు విచారణలో తేలింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితునిపై కిడ్నాప్, రేప్, పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పరిచామన్నారు. జడ్జి నిందితునికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు..

దండేపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బారతపు సత్తవ్వ, ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన బారతపు కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగాలక్ష్మి ఈనెల 14న దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా కుమారస్వామి, లింగయ్యను ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

వాంకిడి: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని బంబార గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న బైక్‌ను తనిఖీ చేయగా 5 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. మహారాష్ట్రలోని రాజూర తాలూకా సుడక్‌పల్లి గ్రామానికి చెందిన మడావి మోతీరాంను అదుపులోకి తీసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి గోపీకాంత్ సమక్షంలో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోషెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి)లో సోమవారం నర్వడే ఈశ్వర్ వద్ద 20 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఏవో భగత్ రమేశ్‌కుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్సై పురుషోత్తం, ఆర్ఐ హాస్సేన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన ఓ యువతి, యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 15న యువతి తన స్నేహితురాలి ఇంటికి చదువుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన దిగంబర్ మధ్యాహ్నం స్నేహితుడికి ఇంటికి వెళ్తానని చెప్పివెళ్లి తిరిగిరాలేదు. ఇరువురి తల్లిదండ్రులు వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

తిర్యాణి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొర్రిగూడకు చెందిన కుడ్మెత దాదాజి (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య సక్కుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన వాగ్మరే సాయినాథ్ (26)మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి గడ్డెన్న వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ పట్టణ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని రిక్షాకాలనీకి చెందిన సంతోష్‌ను గుర్తు తెలియని రైలు ఢీకొట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలు పైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ చోరీకి యత్నించిన యువకుడు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆదివారం సాయంత్రం ఖందేల్వార్ రాజకుమార్ శర్మ అనే వ్యక్తి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షారుఖ్ ఖాన్ దొంగిలించేందుకు యత్నించాడు. బాధితుడు వెంటనే అప్రమత్తమై నిందితుడిని పట్టుకొని వన్‌టౌన్‌లో అప్పగించాడు.

భక్తుల భద్రత గోదావరిలో దీపమే!

- ప్రాణాలు పోతున్నా పట్టింపేది?
- కానరాని కనీస రక్షణ చర్యలు
- ఇప్పటికీ ఏర్పాటు చేయని ఇనుప కంచె
- హామీలు నీటి రాతలే!


బాసర వద్ద గోదావరి నది

భైంసా: బాసర వద్ద గోదావరిలో నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరింది. దీంతో కొన్నిరోజులుగా భక్తులు స్నానఘట్టాల వద్ద కాకుండా నది పొడవున స్నానాలు చేస్తున్నారు. నదిలో అక్కడక్కడ లోతైన ప్రాంతాలు ఉన్నాయని తెలియక స్నానం చేసేందుకు అందులోకి దిగి మృత్యువాత పడుతున్నారు. బాసర వద్ద గోదావరి నదిలో లోతు తెలిపే హెచ్చరిక బోర్డులు లేవు. భక్తులను అప్రమత్తం చేసే సిబ్బంది కూడా ఉండరు. దీంతో భక్తులు గోదావరి నదిలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

పదేళ్ల కాలంలో 127కు పైగా భక్తులు బాసర వద్ద గోదావరిలో నీటమునిగి మృతి చెందారు. 2021లో 10, 2022లో 12, 2023లో 11, 2024లో 10, 2025లో 8 మంది నీట మునిగి మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ అధికారులు తేరుకోవడం లేదు. నదిలో నీటి ప్రవాహం తగ్గిన సమయాల్లోనూ మృత్యువాత పడడం కలచివేస్తుంది. భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగిన సమయాల్లో నదిలోకి వెళ్లేందుకు ఎవరైనా జంకుతారు. నీటి సామర్థ్యం తగ్గినప్పుడు స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈనెల 15న ఆదివారం ఆరుగురు యువకులు ఇసుక తెన్నెల నుంచి లోపలికి వెళ్లి స్నానాలు చేశారు. అందులో ఓ యువకుడు ప్రాణాలతో బయటపడగా రాకేశ్, భరత్, మదన్, వినోద్, రితిక్ అనే యువకులు మృతి చెందారు.

ఆరు నెలలైనా...

గోదావరి నదిలో జరుగుతున్న ప్రమాదాలపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అప్పట్లో స్పందించారు. గతేడాది డిసెంబర్ 18న భైంసా ఏఎస్పీ అవినాశ్‌తో కలిసి బాసర వంతెన, నది పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. వంతెనలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు పర్యవేక్షించేలా సిబ్బందిని నియమిస్తామన్నారు. రెండు జిల్లాల పోలీసుల సహకారంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, బ్లూ కోర్టు సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఆరునెలలు గడిచినప్పటికీ ఇప్పటికీ వంతెనపై ఇనుప కంచె ఏర్పాటు చేయలేదు.

స్థానిక యువకులు విన్నవించినా...

దక్షిణ భారతావనిలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర. అందుకే ఇక్కడికి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇక్కడ తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని 2022లోనే మిషన్ బాసర యువకులు, మేధావులు, యువజన సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి అప్పటి ప్రభుత్వానికి, బాసర ఆలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ గోదావరి నదిలో ఏర్పాట్లను ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు.

ఈ ఏర్పాట్లపై దృష్టి సారించాలి

- నదిలోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలు అందించేందుకు అంబులెన్సు, వైద్యులు అందుబాటులో ఉండాలి.
- నది నీటిలో నీళ్లు మింగి ఊపిరాడని పరిస్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేస్తే ప్రాణాలతో బయటపడొచ్చు అనే విషయాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- గోదావరి నదిలో అన్ని స్నానఘట్టాల వద్దకు భక్తులను అనుమతించవద్దు.
- నది నీటిలోతు తెలుసుకుని ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలి.
- బాసర ఆలయంతో పాటు ఆలయ అధికారులు గోదావరి నది సమీపంలో వచ్చే భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించాలి.
- ఆలయానికి రెగ్యులర్ ఈవోను నియమించాలి.
- బాసర నదికి వెళ్లే మార్గంలో, ఘాట్లకు వెళ్లే ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశాల్లో, రాత్రి సమయాల్లోనూ కనిపించేలా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

బాసర గోదావరిని పరిశీలించిన ఎస్పీ

బాసర: బాసర గోదావరినదిని ఎస్పీ జానకీ షర్మిల సోమవారం పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్నానఘట్టాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. పుష్కర ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఎస్పీ

భక్తులంతా నదివద్దే...

బాసరకు వచ్చే భక్తులంతా ఎక్కువ సమయం గోదావరి నది వద్దే గడుపుతారు. నదిలో స్నానాలు ఆచరించడం, గంగమ్మ తల్లికి పూజలు చేయడంతో పాటు రెండు వంతెనల పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకే ఇష్టపడుతారు. వచ్చిన వారంతా నదిలో కాసేపు విహరించాలని అనుకుంటారు. నదులు ఉన్న పుణ్యక్షేత్రాల్లో వచ్చే భక్తుల కోసం ఎన్నో ఏర్పాట్లు ఉంటే బాసరలో పరీవాహక ప్రాంతాల్లో శుభ్రత పనులు కూడా కనిపించవు. వసంత పంచమి ఏర్పాట్లలో ఘాట్లు, గోదావరి నదీ తీరం అపరిశుభ్రంగా ఉండడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ కార్యకర్తలతో వెళ్లి శుభ్రత పనులు చేపట్టారు. ఇక భక్తులకు కావాల్సిన కనీస వసతులు దేవుడెరుగు. ఆహ్లాదం పంచే గోదావరి నదిలో ఆదివారం వరకు బోట్లు తిప్పారు. లైఫ్ జాకెట్లు లేకుండా భద్రత విషయాలు పరిగణలోకి తీసుకోకుండా బోట్లను నదిలోకి పంపారు. ఈ బోట్లలోనే ఆరుగురు యువకులు నీటిలో నుంచి ఇసుక తెన్నెలకు వెళ్లి ప్రమాదాల బారిన పడ్డారు. ఒకే రోజు ఐదుగురు యువకులు గోదావరి నదిలో మృతి చెందడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్ ఆదేశాలతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి పరిస్థితిని తెలుసుకున్నారు. సోమవారం నుంచి బోటింగ్‌ను నిలిపివేశారు.

15 వేలకు చేరిన దరఖాస్తులు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: ఆర్జీయూకేటీలో ప్రవేశానికి గత నెల 31 నుంచి టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. సోమవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15,015 దరఖాస్తులు వచ్చినట్లు వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 1500 సీట్లను కేటాయించింది. జూన్ 21 వరకు ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత


మాట్లాడుతున్న నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ మండల కేంద్రానికి చెందిన అంకుష్ గౌరు (90) వృద్ధాప్యంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు నారాయణ వృత్తిరీత్యా కండక్టర్ కాగా నిర్మల్‌లో నివాసం ఉంటున్నాడు. తల్లి నిర్మల్‌లో మృతి చెందడంతో సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారం నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం మృతదేహాన్ని అప్పగించారు. అవయవదానం, శరీర దానం చేస్తే మెడికోలకు ప్రాక్టీస్‌తో పాటు పేద ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సైబర్ బాధితులకు నగదు అందజేత

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఎస్పీని సన్మానిస్తున్న సైబర్ బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఈ నెలలో పది కేసుల్లో సైబర్‌క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందించామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఐదుగురు బాధితులు ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాపల్‌గూడకు చెందిన నర్సింగ్ గతేడాది రూ.16,901 కేవైసీ అప్‌డేట్ లింక్ ఓపెన్ చేయడంతో పోగొట్టుకున్నారని, జైనథ్ మండలానికి చెందిన లింగారెడ్డి గూగుల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ కేర్ సర్వీస్ ఫేక్ నంబర్ ఓపెన్ చేసి రూ.2లక్షల 15వేలు పోగొట్టుకోవడంతో రూ.లక్షా 30వేలు తిరిగి అకౌంట్‌లో వేయించామన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జి.రమేశ్ ఫ్రాడ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో సైబర్ నేరగాళ్లు రూ.లక్షా 59వేలు కాజేయగా రూ.60వేలు ఇప్పించామన్నారు. మావలకు చెందిన మిథిలి అనే మహిళ సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ ద్వారా స్నేహితుడిగా సహాయం కోరిన వెంటనే రూ.25వేలు పంపించడంతో తిరిగి వాటిని సైతం ఇప్పించినట్లు తెలిపారు. ఉట్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి స్టాక్ మార్కెట్‌లో దాదాపు రూ.3లక్షలు పోగొట్టుకోగా రూ.50 వేలు కోర్టు ద్వారా అందించినట్లు వివరించారు. సైబర్ క్రైమ్‌కు గురైన బాధితులు వెంటనే 1930, పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


గాయపడిన అశోక్


ఆస్పత్రిలో గంగుబాయి

నిర్మల్ రూరల్: నిర్మల్ మండలం చిట్యాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం....భైంసా పట్టణంలోని అశోక్ నగర్ కాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి ఆమె భర్త బాబు, పింగువ అశోక్, సాయిపుత్ర ప్రజావాణిలో అర్జీలు అందజేసేందుకు ఆటోలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు బయలుదేరారు. చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టి పంట పొలాల్లో పడిపోయింది. ఆటోలో ఉన్న గంగుబాయి, అశోక్, బాబు, డ్రైవర్ సాయిపుత్రకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. ఎస్సై లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వ్యాన్ డ్రైవర్ చేతన్ ప్రకాష్ మీనన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పింఛన్ కోసం మొరపెట్టుకుందామని..

భైంసాటౌన్: పింఛన్ కోసం కలెక్టర్‌కు మొరపెట్టుకుందామని వెళ్లిన వృద్ధ దంపతులతో పాటు వారికి సహాయం చేద్దామని వెళ్లిన ఓ దివ్యాంగుడు, ఆటో నడుపుతున్న డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. భైంసా పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి, ఆమె భర్త బాబు పింఛన్ లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, కలెక్టర్‌కు మొరపెట్టుకుందామనుకున్నారు. సోమవారం ప్రజావాణి ఉండడంతో సహాయంగా దివ్యాంగుడైన అశోక్ పింగ్లేను తోడుగా తీసుకుని ఆటోలో డ్రైవర్‌తో కలిసి నిర్మల్ బయలుదేరారు. నిర్మల్ మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం ఆటోను ఢీకొని ఆటోలోని నలుగురూ తీవ్ర గాయాలపాలయ్యారు. పింఛన్ కోసం అధికారులకు మొరపెట్టుకుందామని బయలుదేరిన వారికి రోడ్డు ప్రమాదం రూపంలో గాయాలే మిగిలాయి.

రెప్పపాటులో.. రెండు ప్రాణాలు

దైవ దర్శనానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్న ఆ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మరికాసేపట్లో ఇంటికి చేరుకునే క్రమంలో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. అప్పటివరకు సంతోషంగా గడిపిన వారంతా చెల్లాచెదురయ్యారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఇద్దరు తనువు చాలించారు. ఈ ఘటనలో అమ్మమ్మ, మనుమడు మృతి చెందగా మనవరాలి పరిస్థితి విషమంగా ఉంది. బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, మనుమడు దుర్మరణం
- ఉట్నూర్‌లోని బీర్సాయిపేట వద్ద చెట్టును ఢీకొట్టిన కారు
- మరో చిన్నారి పరిస్థితి విషమం


కారులో విజయ మృతదేహం


గంట విజయ (ఫైల్)


ఈర్ల సాహర్ష్ (ఫైల్)


సంఘటన స్థలంలో కూతురితో స్రుజనిత

ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఈర్ల రాజు డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో అతని భార్య సృజనిత, కుమారుడు సాహర్ష్(15), కుమార్తె ఆద్యశ్రీతో పాటు సృజనిత తల్లి గంట విజయ(55)తో కలిసి దైవదర్శనం చేసుకునేందుకు శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి కారులో బయల్దేరి వెళ్లారు. కాళేశ్వరం, ధర్మపురి, ఇతర దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం బెల్లంపల్లిలో నివాసం ఉంటున్న సృజనిత అక్క ఇంటికి వెళ్లారు. ఆదివారం అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. మార్గ మధ్యలో ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సాహర్ష్, విజయ సంఘటన స్థలంలోనే మృతి చెందగా ఆద్యశ్రీ తలకు తీవ్రగాయాలయ్యాయి. ముందుగా రిమ్స్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. రాజు, సృజనిత గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్ రాజుకు కునుకు రావడంతోనే ఈ ప్రమా దం జరిగి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఉట్నూర్ ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదం విషయం తెలియడంతో బాధిత కుటుంబీకులు, బంధువులతో పాటు కాలనీవాసులు అధికసంఖ్యలో రిమ్స్ ఆస్పత్రితో పాటు వారి నివాసానికి చేరుకుని చేసిన రోదనలు మిన్నంటాయి. ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. బడులు ప్రారంభం కావడంతో పిల్లలు తరగతులు నష్టపోతారని హడావుడిగా తీసుకువస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సాహర్ష్ జిల్లా కేంద్రంలోని రిజోనెన్స్ పాఠశాలలో పదో తరగతి, ఆద్యశ్రీ అదే పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, తోటి స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు.

పలువురి పరామర్శ..

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు, జరిమానా విధిస్తూ సోమవారం నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం ..2021లో బాసర మండల కేంద్రానికి చెందిన పాలకర్ సాయినాథ్ క్షణికావేశంలో కట్టుకున్న భార్యపై కిరోసిన్ పోసి తగలబెట్టాడు. భార్య చనిపోతూ ఇచ్చిన మరణ వాంగ్మూలంతో పోలీసులు కేసు నమోదు చేసి, పరిశోధన అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు జిల్లా జడ్జి శ్రీవాణి నిందితునికి ఆరు సంవత్సరాల జైలుశిక్ష,రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నేరం చేసిన వారు తప్పించుకోలేరు

నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ జానకీ షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారి వ్యూహంతో న్యాయ విచారణ, నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష పడేలా చేస్తారని సూచించారు. నిందితునికి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు, విచారణ అధికారి ఎస్సై తోట మహేష్, కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్‌ను అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా ఎర్గాట్ల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం బైక్‌పై నిర్మల్‌కు వచ్చారు. తిరుగుప్రయాణంలో కనకాపూర్ చౌరస్తాలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో రవికి తీవ్రగాయాలు కాగా నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సిర్పూర్(యూ) మండలం పాములవాడకు చెందిన పెందూర్‌శంకర్ తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని, రెబ్బెన మండలం గోలేటికి చెందిన లక్ష్మి తనకు పట్టా ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం కమ్మర్‌గావ్‌కు చెందిన పృథ్వీరాజ్ తనకు గురుకులంలో అడ్మిషన్ ఇప్పించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్, ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తవ్వకాలు


విరిగిన దేవతామూర్తి విగ్రహం

కడెం: మండలంలోని దోస్తనగర్ సమీపంలో కొండపై వెలసిన శ్రీనల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. దస్తురాబాద్‌కు చెందిన అర్చకుడు నరేశాచార్యులు సోమవారం భక్తులు, అర్చకులతో కలిసి ఆలయానికి వెళ్లగా పరిసరాల్లో విరగగొట్టిన ద్వార మూర్తి విగ్రహం, అరబిక్ భాషతో కూడిన ఇత్తడి కడ్డీలు, తట్ట, పార కనిపించాయి. పడేసిన విగ్రహాలకు సంప్రోక్షణ, శాంతిపాఠం, నారసింహా పారాయణం జరిపించి పునఃప్రతిష్ఠించారు. ఒకటి రెండు రోజుల వ్యవధిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు భావించారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ ప్రదీప్

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించారు. రెడ్, గ్రీన్ టీంలకు 50 ఓవర్ల మ్యాచ్‌ను కోచ్ ప్రదీప్, సీనియర్ క్రికెటర్లు గోదావర్తి, చందు ప్రారంభించారు. గ్రీన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 13.4 ఓవర్లలో 60 పరుగులు చేసి ఆలౌట్ కాగా రెడ్ జట్టు కేవలం 1 వికెట్‌ను కోల్పోయి 11.1 ఓవర్లలో 61 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.